# ప్రేమనగర్‌లో ఒకరోజు

## పిల్లలమర్రి హనుమంతరావు



ప్రేమంటే నాకు తగని ఇష్టం, త్యాగం కనబడిన చోట చేతులెత్తి దణ్ణం పెడతాను. ఇక ప్రేమ త్యాగాలు కలిసి కట్టుగా వున్నాయంటే చెప్పేదేమున్నది? కారప్పొడిలో ఇడ్లీ నంచుకుని తిన్నంత ఇష్టం.

నా సంగతి తెలిసిన మిత్రుడీ మధ్య కనబడి, ప్రేమనగర్ కథా కమామిషు చెప్పాడు. "ఒకతూరి ప్రేమనగర్ చూచి రాకూడదూ?" అని సలహా ఇచ్చాడు.

మర్నాడే ఆఫీసుకి సెలవ చీటి రాసి, బొంబాయి వి.టి. స్టేషన్‌లో వారణాసి ఎక్స్‌ప్రెస్ ఎక్కి, సీదాగా కాశీ చేరాను.

కాశీలో కాలుపెట్టిన నాకు, విశ్వనాథుడు పట్టలేదు. విశ్వవిద్యాలయమూ పట్టలేదు. గదోలియా, సెంటరులో నిల్చుని ప్రేమనగర్ గూర్చి వాకబు చేశాను. అక్కడ ఎవరికీ ప్రేమనగర్ భోగట్టా తెలిసినట్టు లేదు. ఆ పేరుగల వూరేదీ ఆ ప్రాంతాలలో లేదని గట్టిగా చెప్పారు.

ఏదిరా దారి, భగవంతుడా. ఎడ్రస్ తప్పు రాసుకు తెచ్చానా ఏమిటని, మిత్రుడిచ్చిన యడ్రస్ కాగితాన్ని చూశాను. అందులో "ప్రేమనగర్, అతి నిర్జన ప్రాంతం, గంగానది ఒడ్డు" అని రాసి వున్నది. గంగానది ఒడ్డు అంటే కాశి అని భ్రమించి పరిగెత్తుకుని వచ్చాను. గంగానది దేశంలో ఈ చివర నుంచి ఆ చివర దాకా వున్నది. ఈ ప్రేమనగర్ ఎక్కడున్నదని కనుక్కోగలను.

నా అవస్థని గమనించి ఒక భయ్యా సలహా ఇచ్చాడు. "బరానిలో ప్రేమనగర్ గూర్చి విన్నాను. అక్కడకు వెళ్ళి ఎన్‌క్వైర్ చేయండి."

అదే పదివేలనుకుని, బరానికి పయనమయ్యాను. చిన్నబండిలో ఒకరాత్రి ఒక పగలు ప్రయాణం చేసి బరాని చేరుకున్నాను.

బరాని స్టేషన్‌మాస్టరుని ప్రేమనగర్ ఎక్కడున్నదని అడిగాను. నా వంక వింతగా చూచాడు. "తెలుగువాండ్లా?" అని అరవయాస తెలుగులో నన్నడిగాడు. అవునన్నాను. "అదే అనుకున్నాను సుమా" అన్నట్లు బుర్ర వూపి వెకిలి నవ్వునవ్వాడు. హేళన చేస్తూనే ప్రేమనగర్‌కి వెళ్ళే దోవ చెప్పాడు.

కార్లు పోయే రోడ్డున ప్రేమనగర్ పాతిక మైళ్ళు వుంటుందిట. స్వంత కార్లలో పోవుటయేకాని అక్కడికెవరూ బాడిగె బండ్లు కట్టరట. కాలినడకన ఆరు మైళ్ళు. గంగానది ఒడ్డున ఐదు మైళ్ళు పోయి కుడివైపు తిరిగి మైలుదూరం నడిచిన తర్వాత "అతి నిర్జన ప్రాంతం" అని బోర్డు వుంటుందిట. అప్పుడు ఎడమవైపుకి తిరిగి సుమారు రెండు వందల గజాలు నడిస్తే ప్రేమనగర్ వస్తుందిట.

చీకటి బడ్డది గనుక రేపు పొద్దున ప్రయాణం పెట్టుకుందామని నా కనిపించింది. "ఈ రాత్రి పడుకోవటానికి విశ్రాంతి గదులు లాటివి వున్నాయా?' అని అతనిని ప్రశ్నించాను.

ప్రేమనగర్ వెళ్ళే యాత్రికులకు గదులివ్వటానికి రూల్సు ఒప్పుకోవని నిర్మొగమాటంగా స్పష్టం చేశాడు.

"ఎందుకో ఈ సమాజానికి ప్రేమంటే అంత ద్వేషమ"ని నిట్టూర్చాను. ఆ రాత్రి ప్లాటుఫారం మీదనే చలిలో గడిపాను.

ఉదయం బయలుదేరిన వాడిని తిండితిప్పలూ లేక శోష వచ్చే స్థితిలో మిట్టమధ్యాహ్నం ప్రేమనగర్ చేరాను.

ప్రేమనగర్ కొన్నివేల యకరముల ప్రదేశంలో వున్నది. చుట్టూతా గోడ కట్టారు. నాలుగు దిక్కులా నాలుగు గేట్లు—ఒకగేటు వద్దకు చేరాను.

వలయాకారంగా అమర్చబడిన 'ప్రేమనగర్' అనే అక్షరములు తమనే చూడమన్నట్లు నన్నాహ్వానిస్తున్నాయి. అంత హీన స్థితిలో కూడ 'ప్రేమ' చూడగానే నా మనస్సు పొంగిపోయింది. ఉత్సాహంగా గేటులో నుంచి లోపలకు పోబోయాను. అక్కడున్న గూర్ఖాలు నన్ను ఆపారు. "లోపలకు పోవాలి" అన్నాను. గేటుకి ఆనుకున్న చిన్న కుటీరంలోకి తీసుకపోయారు.

గుమాస్తాలాటి ఆయన టేబుల్ వేసుకుని కూర్చుని వున్నాడు. (అక్కడ వారిని గుమాస్తాలని గాని, మేనేజర్లని గాని పిలువగూడదట. ఆ పేర్లంటేనే పరమ అసహ్యమని నాకు తరువాత తెలిసింది.) ప్రేమనగర్ చూడాలనే కోరికతో, బొంబాయి నుంచి అష్టకష్టముల కోర్చి ఇక్కడకు వచ్చానని నా కథ యావత్తూ చెప్పాను. ఆయన కథంతా విని ఒక పెద్ద ప్రింటెడ్ ఫారము నాకిచ్చి పూర్తి చేయమన్నాడు.

ఎండలో నడచి రావటం వలన నా కళ్ళు బైర్లు కమ్మి అక్షరాలు కెలికినట్లు కనబడ్డాయి. నన్ను చూచి జాలిపడి, "ప్రశ్నలకు సమాధానాలు చెప్పండి. నేనే పూర్తి చేస్తాను." అన్నాడాయన. కృతజ్ఞతా భావం నాలో పెల్లుబికింది. ఆయన ప్రశ్నించాడు.

"మొదటిది — మీరు అంగహీనులా, లేక మూకాంధ బధిరులా?"

నాకు కోపం వచ్చింది. "నీకు కనబడటం లేదటయ్యా."

"అధిక ప్రసంగం చేయకండి. ఈ కాగితంలో రాసిన ప్రశ్నలు చదువుతున్నాను. మీరు అవును లేక కాదు అని మాత్రమే చెప్పాలి. అంగహీనులా, మూకాంధ బధిరులా?"

"రెండూ కాదు."

"విద్యావంతులా, లేక విద్యాహీనులా?"

"చదువుట, రాయుట వచ్చును. డిగ్రీలు లేవు గనుక విద్యావంతుడిగా ఎన్నికకాదు."

"స్త్రీలా? పురుషులా?" "బాలురా? వృద్ధులా?"

"కలవారా? లేనివారా?" "దేశీయులా? విదేశీయులా?"

( చిన్నప్పు డాడుకున్న "కత్తి? కర్రా?" ఆట గుర్తుకి వచ్చింది. )

ఇట్లాంటి ప్రశ్నలు ఒకటనేమిటి? నానారకములైన అడ్డదిడ్డ ప్రశ్నలు వేశాడు. అన్నిటికీ ఓపికగా సమాధానాలు చెప్పాను.

"ఒక్క ఐదునిముషాలు బయటకు వెళ్ళి కూర్చోండి. రిజల్టు చెపుతాము" అన్నాడు.

ఐదు నిముషముల తర్వాత బయలుకు వచ్చాడు.

"మీ సమాధానాలకు మేము మార్కులు వేశాము. మీకున్న క్వాలిఫికేషన్లు—దేశీయులు, పురుషులు. తలిమ్మా ప్రశ్నలకు సున్నా మార్కులు. ఎందుకంటే మీరు ఏదీకాదు. అంటే మొత్తం నూటికి పది మార్కులు వచ్చాయి. ప్రేమనగర్‌లో ప్రవేశించాలంటే కనీసం ముప్పయి మార్కులన్నా రావాలి. సారి, మిస్టర్ రావు. మీకు ప్రేమనగర్‌లో ప్రవేశార్హతలేదు." అన్నాడు.

"సార్, సార్, మీరిట్లా మాట్లాడకండి. ఎంతో కష్టబడి ఇంతదూరం వచ్చాను. మీరు సహాయం చేయాలి. మీ కష్టాన్ని వుంచుకోను. తృణమో, ఫణమో..." నా మాటలు పూర్తి కాలేదు. కోపంతో ఆయన కన్నులు జేవురించాయి.

"యూ, ఫూల్ గెటౌట్. ప్రేమనగర్‌లోనే లంచం ఇస్తావా? రాస్కెల్" కోపంతో ఆయన వూగిపోతున్నాడు. గూర్ఖాలు నన్ను బయటకు గెంటారు.

తోట ద్వారంపై వలయాకారంతో అమర్చబడిన 'ప్రేమనగర్' లోహాక్షరాలు నన్ను వెక్కరిస్తున్నాయి.

నెమ్మదిగా, నీరసంగా అడుగులో అడుగు వేసుకుంటూ దూరంగా నడిచిపోతున్నాను. ఓటమిని ఒప్పుకొనుటకు నా మనస్సంగీకరించుట లేదు.. ఈ పరీక్ష గూర్చి తెలిసి వుంటే ముందుగానే ప్రిపేరై వుండే వాడిననుకున్నాను. దూరంగా చెట్టుకింద ఒక నీగ్రో యువతి సేద తీర్చుకుంటూ వుండటం నా కంటబడింది.

"ఏమండోయ్, ప్రేమనగర్‌కి దారి ఎటు?" అని నన్ను చూస్తూనే ఇంగ్లీషులో ప్రశ్నించింది. నా మెదడులో ఒక ఆలోచన మెరుపు వలె మెరిసింది.

"నేను ప్రేమనగర్‌ని చూపెట్టదను గాని, మీరు కొన్ని ప్రశ్నలకు సమాధానాలు చెప్పాలి. ఆ సమాధానాలు బట్టి మీకు ప్రవేశార్హత లభిస్తుంది." అన్నాను.

"అడగండి. చెపుతాను."

ఆ గుమాస్తాలాటి ఆయన నన్నడిగిన ప్రశ్నలన్నిటినీ అడిగాను. ఆవిడ సమాధానాలు చెప్పింది.

"చూడండి మీ క్వాలిఫికేషన్ విదేశీయులు స్త్రీలు అంటే నూటికి పదిమార్కులు. మీరు ప్రేమనగర్‌లో ప్రవేశించుటకు వీలులేదు.

"ఎట్లాగండీ? ఇండియాలో ఇంత దూరం వచ్చింది ప్రేమనగర్ చూడటానికే గదా?" అన్నదావిడ విసుగ్గా.

"నేను గూడ ప్రేమనగర్ చూడటానికి బొంబాయి నుంచి వచ్చాను. పది మార్కులు రావటంతో బయటకు గెంటారు. మీకు కూడ అదే గతి పడుతుందని హెచ్చరిస్తున్నాను.'' అన్నాను మంచిగా.

"ఏమి చేయుట చెప్మా?" అన్నదావిడ.

"మీరు మరొక విధంగా భావించకపోతే ఒక ఉపాయం చెపుతాను. చూడండి. నీటిలోని కలువ భామకు నింగిలోని చందమామకు అనుబంధం, మంటిలోని పద్మ కన్నెకు మింటిలోని సూర్యభగవానునికి ప్రియబాంధవ్యం, వూరిలోని వుప్పురాయి అడవిలోని చెట్టుకాయి వెరసి ఆవకాయ. ఇదే ప్రకృతి రహస్యం. అవునంటారా? ఆ విధంగానే ఆఫ్రికాలో పుట్టి పెరిగిన మీరూ, ఇండియాలో వున్న నేను కలిసిన ఈ కలయికకు ఘనత వహించిన విధాత ఒక ప్రయోజనాన్ని ఆశించాడు. అవునంటారా? కాదంటారా?" అన్నాను.

ఆవిడ నవ్వింది. "ప్రతి విషయంలోనూ చక్కటి సంబంధాన్నీ, సమన్వయతనూ చూడటంలో మీకు మీరే సాటి లాగ వున్నారు. అసలు విషయమేమిటో త్వరగా చెప్పండి."

నేనాలోచించిన ప్లానంతా ఆవిడకు చెప్పాను. ప్రేమనగర్ దర్శన భాగ్యం కలిగితేనే చాలని అబద్ధం ఆడుటకు ఆవిడ అంగీకరించింది.

మేమిద్దరమూ తూర్పువైపున వున్న మరొక గేటు వద్దకు నడిచాము. ఆ గేటు దగ్గర వున్న ఇంకొక గుమాస్తాలాటి ఆయన మా ఇద్దరికీ చెరొక పదిమార్కులు ఇచ్చి తిరిగి పొమ్మన్నాడు.

"చూడండి, మీతో కొంచం పర్సనల్‌గా మాట్లాడాలి" అని పక్కకు పిలిచాను.

ఆయన నన్ను అనుమానంగా చూస్తూనే అనుసరించాడు.

"మేమిద్దరమూ అంతర్జాతీయ ప్రేమికులం. నిజం చెప్పాలంటే భగ్న ప్రేమికులం. జాతిమతాలు వేరగుట వలన కోరుకున్నటువంటి వివాహం చేసుకోలేని యువతీయువకులం. ఆఫ్రికా వెళ్ళాను. ఆమె ఇండియా వచ్చింది. ప్రపంచమంతటా కలిసి తిరిగాము. మాకెక్కడా శాంతి లేదు. ప్రేమనగర్‌లో శాంతి దొరుకుతుందనే ఆశతో ఇక్కడకు వచ్చాము. ఇప్పుడు మా ఆశలను అడియాసలు చేయుట మీకు తగునా?'' అని కన్నులలో నీరు నింపుకుంటూ జాలిగా ఆయనను ప్రశ్నించాను.

"నన్ను క్షమించండి. మీలాటి వారు మా ప్రేమనగర్‌కి ప్రత్యేక అతిథులు. ఇప్పుడే కృష్ణమూర్తి గారికి ఫోన్ చేస్తాను.'' అని వినయంగా నాతో అని లోపల గదిలోకి వెడుతూ, "భగ్న ప్రేమికులు, అందులో అంతర్జాతీయ భగ్న ప్రేమికులంటే మాటలా మరి'' అని ఆయన సన్నగా అనుకోవటం నేను వినబడింది.

పది నిముషములలో కుటీరం బయట కారు ఆగిన చప్పుడయింది. మేమందరమూ బయటకు వచ్చాము. కారులో నుంచి ఇరువది రెండు సంవత్సరముల ఆజానుబాహుడు, సుందర రూపువైన యువకుడొకడు దిగాడు. అతని వెనుకగా సుందర రూపవతి ఐన ఇరువది సంవత్సరముల యువతి వున్నది.

"వీరు కృష్ణమూర్తిగారు. ఇక్కడ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ లాటి ఆయన. ఈయన రావుగారు—ఫోన్‌లో వీరి గురించే నేను మాట్లాడింది" అని మా ఉభయులనీ ఆ గుమాస్తాలాటి ఆయన పరిచయం చేశాడు. ఇద్దరమూ కరచాలనము చేసుకున్నాము. కృష్ణమూర్తిగారు ఆ యువతిని నాకు పరిచయం చేశాడు. "ఈవిడ నా భార్య మోహినీదేవి. వెల్‌ఫేర్ ఆఫీసర్ లాటి ఆవిడ" నేను కూడ నీగ్రో యువతిని సౌఖ్యవైనంత మెలోడ్రమాటిక్‌గా పరిచయం చేశాను.

"అవును, పాపం, వారు ఫోనులో చెప్పారు." అని సానుభూతిని ప్రకటించారు మోహినీదేవి, కృష్ణమూర్తి.

మా ఇద్దరికీ ఎయిర్ కండిషన్ అతిథిగృహంలో ప్రత్యేకంగా బస యేర్పాటు చేశారు. స్నానం చేసి, వృష్టాన్న భోజనము తిన్నాము. (పాపం ఆ నీగ్రో యువతికి ఆవకాయను చూస్తూనే వాంతి అయింది) కొద్దిసేపు విశ్రాంతి తీసుకున్నాము.

సాయంకాలం ప్రత్యేకమైన కారులో మా ఇద్దరకు ప్రేమనగర్‌ని చూపెట్టారు.

ఆహా! ఆ వైభవం వర్ణించుటకు ఒక కావ్యం సరిపోదు. అంతా పెద్దతోట—ఒక చిన్నపట్టణం—పెద్ద పల్లెటూరు! అన్ని వైభోగాలు అందులోనే వున్నాయి. చిన్నచిన్న కుటీరాలు, పెద్దపెద్ద మేడలూ వున్నాయి.

అక్కడక్కడా చెరువులు, బావులు, గోతులు.

రకరకాల పశువులు, సింహాలు, పులులు, పిల్లులు ఎలుకలూ అన్నీ ఎక్కడికక్కడ అమర్చి పెట్టినట్లు స్వంత సఖ్యతగా వున్నాయి.

మరొక చోట పలురకాల పక్షులు, గరుత్మంతులూ, గద్దలూ, కాకులు, మిడతలూ—అది ఇది అని పేరేలా, అన్నీ వున్నాయి.

ఇక మనుష్యుల సంగతి. విద్యావంతులూ, విద్యాహీనులు, స్త్రీలు, పురుషులు—యువతీ, యువకులు బాలురూ, వృద్ధులూ కలవారు, లేనివారు— దేశీయులు, విదేశీయులు—అంగవికలులూ— మూకాంధ బధిరులు. ఒకరని యేమిటి? ఆ ప్రశ్నల పట్టీలో పేర్కొన్న వారందరూ ప్రేమనగర్‌లో స్థావరాలు ఏర్పాటు చేసుకుని నివసిస్తున్నారు.( మొదట అతినిర్జన ప్రశాంత ప్రదేశమని చెప్పి అన్నీ వున్నాయి. అందరూ వున్నారు. ఏమిటీ గందరగోళమని పాఠకులకు సందేహం రాకూడదు మరి!) ఎక్కడికక్కడ సరళత సౌమ్యత ఆప్యాయత శాంతి ప్రేమ వగైరాలు వెల్లివిరిస్తున్నాయి.

నేను అమెరికా వెళ్ళలేదు. "డిస్నీలాండ్" చూడలేదు. కాని ప్రేమనగర్ ముందు డిస్నీలాండు దిగదుడుపే కష్టేనని నా మనస్సులో అనిపించింది. ( ఇండియాలో పాత జమీందారులూ రాజులూ మహారాజులూ హోటళ్ళ వ్యాపారం చేసి డబ్బు సంపాదిస్తున్నారని విదేశాలలో అపఖ్యాతి వచ్చిందిట. వారికి జమీందారు ధీరవర్మగారి ప్రేమనగర్ చూపితే ఎంత బాగుంటుంది!)

డ్రైవరు రోడ్డు పక్కగా కారు ఆపి మాతో అన్నాడు. "అటు దూరంగా చెట్టు నీడని కూర్చున్న ఆవిడ రాణి సాహెబావారు. జమీందారు తల్లిగారు. ఈ చరమదశలో తాపత్రయాలను వదుల్చుకుని శేషజీవితాన్ని ప్రశాంతంగా గడుపుదామని నిశ్చయించుకుని ఇక్కడకు వచ్చింది."

నేను అటు చూశాను. దూరంగా వృక్ష ఛాయన వాలు కుర్చీలో ఒక వృద్ధురాలు కూర్చుని వున్నది. అన్నిరకములైన పక్షులు ఆ చెట్టు కొమ్మల మీద కూర్చుని వివిధములైన శబ్దములను వీనులవిందుగా వినిపిస్తున్నాయి. అన్నిరకములైన పశువులు ఆతరుఛాయనే తోకలాడిస్తూ ఆవిడ పక్కగా నిల్చున్నాయి.

# హెడన్సా




మూల
వ్యాధులకు.
ప్రతి చోట దొరుకును



ఉచితము : ఉచితము!!!

## తెల్ల మచ్చలు

మా ప్రఖ్యాతివహించిన 'డాగ్ సోఫా' ప్రత్యేక ఔషధము తెల్లమచ్చలను సులభముగ పోగొట్టు టలో 1925 సం॥ నుండి ప్రఖ్యాతి వహించి యున్నది. మూడు రోజులు వాడినంతనే మచ్చల రంగు మారి కొన్ని రోజులలోనే పూర్తిగా బాగుచేయబడగలదు. ఉచితంగా ఒక పాకెట్ మందు ఇవ్వబడును. వెంటనే చూచి మోసపోకండి.

**Bengal Ayurved Bhawan**
P. O. Katri Sarai (Gaya) India



## అధైర్య పడవద్దు

శాస్త్రీయమైన, నిజమైన SEX-ADVICE పొందవచ్చును. మీకు ఉన్న లక్షణములు వ్రాయుచూ, యిక వివరాలకు వ్రాయవలెను.

డా. రత్నం&సన్స్, (Estd 1904)
మలక్‌పేట బిల్డింగ్స్, New
(అజంపూరా మార్కెట్ వద్ద)
హైదరాబాద్—36 ఆం. ప్ర.



## పుస్తకములు

5 పుస్తకముల సెట్టు రు. 5–50.

(1) కొక్కోకశాస్త్రం (2) సుహాగ్‌రాత్ (3) చుంబన పద్ధతులు, (4) 84 ఆసనములు, (5) రహస్య ఫోటో ఆల్బం. ఒక్కొక్క పుస్తకం రు. 2/-. పోస్టేజి, ప్యాకింగ్ అదనం. ఇంగ్లీషులో వ్రాయండి.

SULEKHA TRADERS.
WAT-7) Beat No 13. Aligarh


# ప్రేమనగర్‌లో ఒకరోజు

అంగవికలులూ, స్త్రీలు, పురుషులు... (ఇందాక లిస్టులో చెప్పిన జనాభా అంతా) ముచ్చటగా బారులు తీర్చి ఆవిడ ముందర కూర్చుని వున్నారు. అంతా కోలాహలంగా వున్నది. ఆవిడ ప్రశాంత జీవనానికి మనస్సులోనే అంజలి ఘటించాను. మమ్మల్నిద్దరినీ అక్కడ కూర్చోమని డ్రైవరు సంజ్ఞ చేశాడు. కూర్చున్నాము.

ఇంతలో భీరవర్మగారు కూడ అక్కడకు వచ్చాడు. పెద్ద కలకలం బయలుదేరింది. అతడిని చూస్తూనే ఎక్కడివక్కడే, ఎప్పటికప్పుడే, ఎవరికి వారే నిలబడి నమస్కారాలు చేశారు. నేను కూడ నిలబడి నమస్కారం చేస్తూనే పరిస్థితులను ఆకళింపు చేసుకున్నాను. అతడంటే అందరికీ గౌరవమని నాకు అర్థమైంది.

ప్రేమ స్వరూపురాలు త్యాగలతాదేవి గారు కూడ వచ్చారు. ఆ క్షణంలోనే నా కన్నులు చరితార్థమై పోయాయి. ప్రేమలో త్యాగాన్ని త్యాగంలో ప్రేమను నేను దర్శించాను. ప్రేమత్యాగాలు ఒకదాని కొకటి నీరు పాలువోలె, విడదీయుటకు వీలు లేకుండా కలసి పోయాయి. నా జన్మ ధన్యమైంది.

కృష్ణమూర్తి భీరవర్మకు నన్ను పరిచయం చేశాడు. నా సందేహములను కొన్ని ఆయన ముందు వ్యక్తపరిచాను. భీరవర్మ ఓపికగా గంటన్నర సేపు నాకు ప్రేమ సూక్ష్మాలను గూర్చి తెలియజేశారు. నా వంటి మందమతికి కూడ ఎక్కడికక్కడ విడమర్చి అర్థమయ్యేటట్లు చెప్పారు. వారు నన్ను చాలా అభిమానించారు. రాత్రి జరుగబోవు అంతరంగిక సమావేశంలో నన్ను రానిచ్చుటకు దయతో అనుమతిచ్చారు.

ఆరాత్రి ఒక త్యాగి యొక్క అత్మకథను వింటూ కూర్చున్నాను. అందువలన చాలా ఆలస్యంగా సమావేశానికి వెళ్ళాను.

వాతావరణం బాగా వుద్రేకంగా వున్నది. సభాపతికి దగ్గరగా పాతిక సంవత్సరముల యువకుడొకడు నిలబడి వున్నాడు. అందరూ తీవ్రంగా అతని వంక చూస్తున్నారు. అంతటా భయంకరమైన నిశ్శబ్దం తాండవిస్తోంది.

నేనొక చోట నద్దుమణిగి కూర్చుని "ఏమిటి జరుగుతుంది?" అని పక్కవాడి చెవిలో రహస్యంగా అడిగాను. అతనొక మూకబధిరాంధుడు. వినబడదు. కనబడదు. (ఆ సభకి ఎందుకు వచ్చాడో తెలియదు.) మూడుకుర్చీల అవతల కూర్చున్నవాడు కొంచం నయం. కేవలం అంధుడు మాత్రమే. అతని దగ్గరగా జరిగి "ఏమిటి జరుగుతుంది?" అన్నాను.

"ఈ యువకుడు చాలా పెద్ద తప్పు చేశాడు."

"ఏమిటా తప్పు?" సమాధానంలేదు. మళ్ళీ అడిగాను.

"ఆడామగా కలసి చేసే తప్పేనయ్యా" అన్నాడు విసుగ్గా.

నాకు కుతూహలం పెరిగిపోయింది. "మరి ఆవిడేది?" అన్నాను ఉత్సుకతతో.

"ఆవిడంటే ఇంకెవరనుకున్నావు? అతని భార్యే!"

నాకు మతిపోయింది. భార్యాభర్తలకూడ తప్పేనా? ఇదంతా ఏదో గమ్మత్తైన నాటకంలాగ నాక్కు తోచింది. మిగిలిన సభికులందరూ నా నోరు నొక్కేశారు. నా కుతుహలాన్ని భీరవర్మ గమనించి మౌనంగా వుండమని సంజ్ఞ చేశాడు.

ఆశ్రమ వాతావరణం కలుషితం చేసినందుకు ఆ యువక దంపతులను ప్రేమనగర్ విడిచి వెంటనే వెళ్ళిపోవాలని భీరవర్మ తీర్పు ఇచ్చాడు. సమావేశం పూర్తి అయిపోయింది.

నేను భీరవర్మ మిగిలిపోయాము.

"మిస్టర్ రావు. నీ వడుగదలచుకున్న దేమిటో నాకు తెలుసు. నేనొకనాడు అన్నిరకములైన అనుభవాలను అనుభవించాను. సుఖాన్ని కొనుక్కున్నాను. నా అమృతమూర్తి నాకు మొదటిసారిగా ప్రేమ అనురాగం అన్నదేమిటో తెలియజేసింది. భౌతికమైన అల్పమైన కోరికలతో మాకు పని లేదు. రాగద్వేషాలను శాశ్వతంగా అధిగమించిన విరాగులం. మనసులనూ ప్రవర్తననూ స్వార్థంతో ముడిపెట్టి, సంకుచితులను కావించే సాంసారిక ధర్మానికే మేము అతీతులం. ఇదియే మా అతీత మానవ స్థితికి మూలకారణం. ఇదియే మా ఆదర్శం.

ఈ ఆదర్శంతోనే మానవసేవ, లోకకల్యాణం చేద్దామని ఈ ప్రేమనగర్‌ని నెలకొల్పాము. నెమ్మది నెమ్మదిగా సాధన చేసిన మీదట మేము సాధించిన ఈ అతీతమానవ స్థితిని ప్రతి ఒక్కరూ చేరగలరని మా ఉద్దేశం. అందుకే ప్రతిఒక్కరూ ఈ ప్రేమనగరులో వున్నంత కాలమూ సంకుచితులను కావించే సాంసారిక ధర్మానికి దూరంగా వుండాలని మా నియమం. ఈ నియమం కర్కశంగా నిర్దాక్షిణ్యంగా వున్నదని నాకు తెలుసు. కాని ప్రతివాడూ ఈ నియమాన్ని అనుసరించవలసిందే."

భీరవర్మ సుదీర్ఘమైన ఉపన్యాసాన్ని ముగించాడు. బాబోయ్ మనుష్యులు కాదు వీళ్ళు. 'ప్రేమ' 'త్యాగం' అనే పదాలను పట్టుకుని వేలాడుతున్న జీవచ్ఛవాలు! అన్నిరకములైన జంతువులనీ, పక్షులనీ సేకరించిన జూ, ఈ ప్రేమనగర్ అనే 'జూ'లో అన్ని రకములైన మనుష్యులను పట్టుకుని వచ్చి ప్రదర్శిస్తున్నాడీ భీరవర్మ! వారితో మెదులుతున్న ప్రతి క్షణం నాకు భయంకరంగా తోచింది.

మర్నాడు ఉదయమే ప్రేమనగర్‌కి 'గుడ్‌బై' కొట్టి, బొంబాయి బయలుదేరాను. బొంబాయి వి.టి. స్టేషన్‌లో (పౌరుషాభిమానాలు గల) లక్షలాది మామూలు మనుష్యులతో కలసిపోవుటయే నాకు సుఖమనిపించింది.